క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు చెక్ అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం కృష్ణంరాజుపేటకు చెందిన గాదు సాయి సందీప్ పేరిట ఆయన తండ్రి గాదు వెంకటనారాయణ ఆదివారం విరాళం అందజేశారు. ఈ మేరకు ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్‌కు రూ.1,00,116 విరాళ చెక్ అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటిండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. దాతలకు అంతరాలయ దర్శనంతో పాటు రథసప్తమి వంటి విశేష పర్వదినాల్లో దాతల పాసుల ద్వారా ప్రత్యేక దర్శనానికి అవకాశముంటుందని ఈవో తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెయిన్ సెంటర్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ నేతృత్వంలో విశ్వబంధుత్వ దినోత్సవం నేపథ్యంలో విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ప్రకాష్ మణి దాదీజీ స్మృతికి చిహ్నంగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు సత్యనారాయణ, పి.భానుమూర్తి, హారిక, మందుల మోహనరావులు మాట్లాడుతూ రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు బి.కె.జ్యోతి, పలువురు బ్రహ్మకుమారీ పాల్గొన్నారు.

దేవీవరప్రసాద్‌కు అభినందనలు



దేవీవరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగం బయాలజీ సబ్జెక్ట్‌లో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన లావేరు మండలం తాళ్లవలసకు చెందిన పిసిని దేవీవరప్రసాద్‌ను ఆదివారం గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశెట్టి తిరుపతిరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై చర్చ



సజ్జల రామకృష్ణారెడ్డితో వైఎస్సార్ సీపీ నాయకులు

ఎచ్చెర్ల: విజయవాడలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ శిక్షణా సమావేశానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సనపల నారాయణరావు, గేదెల పురుషోత్తమరావు, అంధవరపు వెంకటసురేష్‌లు హాజరయ్యారు. పార్టీ పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులను కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు.

- మురికికూపాల్లా ఖాళీ స్థలాలు
- దోమలు, కీటకాలకు నిలయాలుగా మారిన వైనం
- వ్యాధుల బారిన ఇరుగుపొరుగు జనాలు
- పట్టించుకోని అధికారులు

ఖాళీ స్థలాలు.. దోమలకు నిలయాలు!



తోలపాలెం రోడ్డులో జనావాసాల మధ్య వర్షం నీరు



గోవిందనగర్‌కాలనీ-2లో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



డీసీసీబీ కాలనీలో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర పరిధిలోని ఖాళీ స్థలాలు దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. డీసీసీబీ కాలనీ, తోలపాలెం రోడ్డు, నీలమ్మతల్లి చెరువుగట్టు రోడ్డు, గోవిందనగర్ కాలనీ-2, బ్యాంకర్స్ కాలనీ, ఏఎస్ఎన్ కాలనీ, శాంతినగర్‌కాలనీ, ఇందిరానగర్ కాలనీ, జామితోట, విశాఖ-ఏ, విశాఖ-బి, ఫ్రెండ్స్ కాలనీ, తిలక్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. కొందరు స్థిరాస్తులు పెంచుకునేందుకు స్థలాలు కొనుగోలు చేసి భవిష్యత్ అవసరాల పేరిట వదిలేస్తున్నారు. వాటిలో పిచ్చిమొక్కలు భారీగా పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా వర్షపునీరు నిల్వ ఉండి మురుగునీరుగా మారి దోమలు, పందులకు, విష పురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి.

ఇరుగు పొరుగుకు ఇబ్బందులు..

ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తూ చుట్టుపక్కల వారికి నరకం చూపిస్తున్నాయి. భూ యజమానులకు డబ్బులు.. ఇరుగు పొరుగు వారికి జబ్బులు వస్తున్నాయంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించినా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా కార్పొరేషన్ అధికారులు జనావాసాల్లో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు సమాచారం తెలియజేసి మట్టి వేసుకుని ఎత్తు చేయించడం, పిచ్చిమొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

విష కీటకాలు..



మా ప్రాంతంలో చిన్న వర్షం కురిసినా ఖాళీ స్థలాలు చెరువులా తయారవుతున్నాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి విషసర్పాలు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. సాయంత్రం దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.
– జి.శ్రీనివాస్, భవానినగర్, డీసీసీబీ కాలనీ, శ్రీకాకుళం

ఎన్నిసార్లు చెప్పినా..



ఖాళీ స్థలాలు విషసర్పాలకు నిలయంగా మారుతున్నాయి. చిన్న వర్షం పడుతున్నా పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని స్థల యజమానులను కోరినా పట్టించుకోవడం లేదు.
– వి.రామకృష్ణ, నీలమ్మచెరువు గట్టు, పీఎన్‌కాలనీ, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం..

ఖాళీ స్థలాల్లో దోమలు ఉండకుండా ఆయిల్ బాల్స్ వేయించాం. స్థల యజమానులకు సైతం నోటీసులు ఇస్తున్నాం. ఖాళీ స్థలాలను ఎత్తు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. మరోసారి స్థల యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తాం.
– పి.వి.వి.డి ప్రసాదరావు, నగరపాలన సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

రోడ్డుపైనే మురుగునీరు.. స్పందించే వారే లేరు



పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లే రోడ్డులో మురుగునీటి ప్రవాహం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలోని ముత్యాలమ్మ మార్కెట్ నుంచి పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లే దారిలో పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. మూడు నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు స్పందించడం లేదు. దీంతో మురుగులోనే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డుపైకి నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదని, కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా సంబంధించి మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



ప్రతిమలను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



మొండేటివీధిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



సంపత్ వినాయక గుడి వద్ద గణపతి ప్రతిమల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం అర్బన్: నగరంలోని మొండేటి వీధిలో లక్ష్మీ గణపతి ఆలయంలో షిరిడి సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. చవితి పూజా కార్యక్రమాల పుస్తకాన్ని కూడా అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కర్రా భాస్కరరావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని మంగువారి తోటలో సంపత్ వినాయక దేవాలయంలో 500 మట్టి వినాయక విగ్రహాలు, పూజా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండా రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు మల్లారిదేవి, అర్చకులు గోవిందు వెంకట రామారావు శర్మ తదితరులు పాల్గొన్నారు.
- రాగోలు కూడలిలో లయన్స్ క్లబ్ జిల్లా పర్యావరణ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, శ్రీకాకుళం, మన్యం జిల్లాల పర్యావరణ ఇంజనీర్ బి.కరుణశ్రీ, మెంటార్ నటుకుల మోహన్, సభ్యులు బాడాన దేవభూషణ్, కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారి బరాటం కృష్ణ చైతన్య, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, ఉపాధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్, డాక్టర్ బగాది శ్రావ్య, ఊన్న రమేష్, బగాది కుసుమ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



లావేరులో రంగా విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

రణస్థలం: ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి సానా రుద్రవరం గ్రామంలో వంగవీటి మోహన రంగా విగ్రహం పట్ల దుశ్చర్యకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు లావేరు మండల కేంద్రంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యినపకూర్తి సతీష్, గ్రామపెద్దలు లంకలపల్లి రాంబాబు, మాకన శంకరరావు, శ్రీనువాసరావు, ఆనందరావు, పైడి దాము తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల పరిశీలన



నక్కవీధి గణేష్ మండపం వద్ద పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న గణేషుని మండపాలను ఎస్ఐ ఎం.హరికృష్ణ ఫైర్, మున్సిపాలిటీ, విద్యుత్తు శాఖల సిబ్బందితో కలసి ఆదివారం పరిశీలించారు. కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.

వ్యాధులపై అప్రమత్తం

జి.సిగడాం: వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ వర్షం నీరు, మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. నీరు నిల్వ ఉంటే డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశముందన్నారు.

మురపాక మండల ఏర్పాటుకు సహకరించాలి



విజయనగరం ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

రణస్థలం: మురపాక మండల ఏర్పాటుకు సహకారం అందించాలని మురపాక మండల సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులను ఆదివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రథమ పూజ్యుడు గణపతి



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మనం ప్రారంభించే ఏ కార్యక్రమమైనా విఘ్నాలు లేకుండా కొనసాగాలంటే పూజించాల్సినది గణపతినే అని వక్త నిష్టల నరసింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో వినాయక తత్త్వం అనే అంశంపై ఆదివారం ప్రసంగించారు. వినాయకుని ఆవిర్భావం వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మందుల మోహనరావు, నిక్కు అప్పన్న, రాంబాబు, సింహాచలం, తవుడు, నారాయణమూర్తి, బాబూరావు, పట్నాయక్, ఈశ్వరరావు, విశ్వేశ్వరరావు, సరస్వతి పాల్గొన్నారు.

యూరియా.. లేదయా!



వర్షాలు కురవడంతో ఊపందుకున్న దమ్ములు

- రైతు సేవా కేంద్రాల్లో కానరాని నిల్వలు
- పీఏసీఎస్, డీసీఎంఎస్, ప్రైవేటు వర్తకుల వద్ద అదే పరిస్థితి
- పట్టించుకోని పాలకులు



వరి పంట

గార: వర్షాలు కురవడంతో ఖరీఫ్ వరి పనులు ఊపందుకున్నాయి. గార మండలంలో 80 శాతం మేర వెద సాగు జరిగితే మిగిలిన 20 శాతం దమ్ము పద్ధతిలో సాగుచేస్తున్నారు. ఈ సమయంలో ఎరువులు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతీ పంచాయతీ పరిధిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువు నిల్వలు సిద్ధంగా ఉంచేవారు. ఐదేళ్లలో ఎక్కడా ఎరువులు కొరత అనేమాట లేకుండా అన్నదాతలకు విత్తనాలు అందుబాటులో ఉంచారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రానికి పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ వాటిని బలోపేతంపై దృష్టి సారించలేదు. కనీసం ఎరువులు సమయానికి అందించాలన్న విషయం కూడా మర్చిపోయా. ఏటా ఆగస్టులో ఖరీఫ్ సీజన్ ప్రారంభయ్యే నాటికి ఎరువుల నిల్వలు సిద్ధంగా ఉంచాల్సి ఉన్నా ముందస్తు చర్యలు తీసుకోలేదు.

నో స్టాక్ బోర్డులు..

గార మండలంలో 22 రైతు సేవాకేంద్రాలు, తూలుగు, అంపోలు పీఏసీఎస్‌లతో పాటు గారలో డీసీఎంఎస్ కేంద్రం ఉంది. వీటిలో ఎక్కడా యూరియా బస్తాల స్టాకు లేదు. మండలంలో 17,260 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వెద సాగు చేసిన పొలాల్లో నెల రోజులుగా ఎండల వల మొక్కలు ఎదగలేదు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు చనిపోయే దశకు చేరుకున్నాయి. వీటిని కాపాడుకోనేందుకు వెంటనే యూరియా వేయాల్సి ఉంది. వర్షాలు కురుస్తుండటంతో రైతులంతా యూరియా కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రైవేటు వర్తకుల ఇష్టారాజ్యం..

కొందరు ప్రైవేటు వర్తకులు ఎరువులను అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. యూరియా బస్తా రూ.275కు అమ్మాల్సి ఉన్నా ఏకంగా రూ.350లు వరకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా వీటికి గుళికలు, జింక్ ప్యాకెట్ కూడా కొనుగోలు చేయాలని బలవంతం పెడుతున్నారని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం విఫలం



రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతులకు అవసరమైన ఎరువులు అందించడంలో విఫలమయ్యారు. మిగతా ఎరువుల కంటే యూరియా కోసం ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు.
– పీస శ్రీహరిరావు, సర్పంచ్, కొర్లాం

లేదంటున్నారు..



యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్దకు వెళ్తే లేదని చెబుతున్నారు. ప్రైవేటు షాపుల్లోనూ అదే పరిస్థితి. ఈ సమయంలో ఎరువు తప్పక వేయాలి. ప్రభుత్వం మాత్రం ఎరువులు ఉంచేందుకు చర్యలు చేపట్టలేదు.
– పప్పు బాబూరావు, రైతు, గార

ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న జి.సిగడాం ఎస్ఐ మధుసూదనరావు

జి.సిగడాం: వినాయక నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ వై.మధుసూదనరావు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పల్లెల్లో వివిధ వ్యాపారాల కోసం వచ్చే అపరిచితుల నడవడికను పరిశీలించి అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వాహనచోదకులు విధిగా అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు.

ఘనంగా మెహెర్‌బాబా కేంద్రం వార్షికోత్సవం



లఘునాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని కత్తెర వీధిలో అవతార్ మెహెర్‌బాబా కేంద్రం 64వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఉమామహేశ్వరి సింగ్ బాబా ప్రవచించిన కర్మ యోగం ఆవశ్యకతను వివరించారు. అనంతరం సంకీర్తనా గానం, లఘునాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కమిటీ సభ్యులు పి.వి.రంగ ప్రసాదరావు, ఆనంద్‌కుమార్, వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.